7వ పాఠం ఆగష్టు 7-13

# విశ్రాంతి, స్నేహ బంధములు మరియు స్వస్థత

సబ్బాతు మధ్యాహ్నము ఆగష్టు 7

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : ఆది 42:7-20; 42:21-24; మత్త 18:21-35; లూకా 23:34; ఆది 50:15-21.**

**కంఠతవచనం : "అయినను నేనిక్కడికి వచ్చునట్లు మీరు నన్ను అమ్మివేసినందుకు దుఃఖపడకుడి. అది మీకు సంతాపము పుట్టింపనియ్యకుడి. ప్రాణ రక్షణ కొరకు దేవుడు ముందుగా నన్ను పంపించెను" (ఆది 45:5).**

నేర చరిత్రగల ఒక మగవాడిపై స్త్రీ నింద మోపుచున్నది. అతడు ఆమెను బలవంతము చేసి ఆమెతో లైంగిక వాంఛ తీర్చుకున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె యొక్క కథనం విన్న కొందరు కొన్ని ప్రశ్నలను లేవనెత్తారు. అయితే పోలీసులు నిలబెట్టిన నేరస్తుల వరుసలో ఆ స్త్రీ అతడిని గుర్తు పట్టి నిజముగా అతడే ఆమెపై అఘాయిత్యము చేసాడని చెప్పింది.

జోనీ అనే ఆ వ్యక్తిని జైలుకు పంపించారు. 14 సం॥ల తరువాత అతనిపై జరిపిన శాస్త్రీయ పరీక్షలలో జోనీ నేరము చేయలేదని నిరూపణ అయింది. ఆ స్త్రీ జోయన్ తప్పు చేయని ఆ మగవానిని నిందించినట్లు అర్థము చేసుకున్నది.

జోనీ జైలు నుండి విడుదలయిన తరువాత జోయన్ అతనిని కలుసుకోవాలనుకుంది. అనేక సంవత్సరములు తన జీవితాన్ని జైలుపాటు చేసి నాశనము చేసిన ఆ స్త్రీని ఇప్పుడు ముఖాముఖిగా చూచినప్పుడు ఏమి చేస్తాడు? ఒక సందేహమైతే ఏర్పడినది.

జైలు వద్ద ఒక గదిలో జోయన్ అతని కొరకు నిరీక్షించుచున్నది. కొంత సమయము తరువాత జోనీ వచ్చాడు. అతడు మరియు ఆ స్త్రీ జోయన్ ఒకరినొకరు చూచుకున్నారు. జోయన్ ఏడ్వటం మొదలు పెట్టింది.

జోయన్ ఆ తరువాత వేరే వారికి చెప్పింది. "జోనీ నా చేతులను తీసుకొని నన్ను చూచి నిన్ను నేను క్షమిస్తున్నాను" అని చెప్పాడు. 14 సంవత్సరాలు అతడిని నేను ద్వేషిస్తూ ఉన్నాను. అతడు చచ్చిపోతే బాగుండు ననుకున్నాను. అయితే నేనతనికి చాలా అన్యాయము చేసినను అతడు నన్ను క్షమిస్తున్నానని చెప్పాడు. నేను నమ్మలేకపోయాను. క్షమాపణ అంటే

ఏమిటో ఇప్పుడు నాకర్థమైంది. నన్ను నేను సముదాయించుకున్న తరువాత నేను నిజమైన విశ్రాంతిని పొందాను".

ఈ వారము మనము క్షమించుట అనే అంశమును అధ్యయనము చేయబోతున్నాము. విశ్రాంతి అవసరమైన గాయపడిన మానవ హృదయాలను క్షమాపణ స్వస్థపరుస్తుంది.

**ఆదివారం** **ఆగష్టు 8**

## గతమును ఎదుర్కొనుట (ఆది 42:7-20)

కొంత కాలానికి యోసేపు యొక్క జీవితము అభివృద్ధి మార్గములో ప్రవేశించింది. రాజైన ఫరోకు వచ్చిన కలల భావమును తప్పులు లేకుండా చెప్పుట వలన అతడు జైలు జీవితము నుండి విడుదల పొందాడు. తరువాత యోసేపును ఫరో దేశమంతటిపై అధికారిగా నియమించాడు (ఆది 41). ఐగుప్తు దేశపు యాజకుని కుమార్తెయగు ఆసెనతునిచ్చి యోసేపునకు ఫరో పెండ్లి చేసెను. యోసేపు ఆసెనతులకు ఇద్దరుకుమారులు జన్మించిరి. ఐగుప్తు దేశములో ధాన్యపు కొట్లు అన్నియు ఆహార ధాన్యముతో నింపబడెను. యోసేపు చెప్పినట్లుగానే ఆహార కొరత ప్రారంభమైంది. అంతట అతని సోదరులు ఐగుప్తుకు వచ్చిరి.

**ఆది 42:7-20లో వ్రాయబడినట్లు యోసేపు, సహోదరుల మొదటి సమావేశమును గూర్చి మరొకసారి చదవండి. ఆ వాక్యభాగాలలో యోసేపు యొక్క ప్రవర్తనను గూర్చి వ్రాయబడింది. యోసేపు ఎందుకావిధముగా ప్రవర్తించాడు? అతడు ఏమి చేయాలని ప్రయత్నిస్తున్నాడు?**

యోసేపు ఇపుడు గొప్ప అధికారము గల శక్తిమంతుడు. అతడు అనుకుంటే తన సోదరులను శిక్షించగలడు లేక పగ తీర్చుకొనగలడు. అయితే యోసేపు ప్రతీకారమును తీసుకొనుట లేదు. వారి యెడల కృపనే ఎన్నుకున్నాడు. తన ఇంటి వద్దనున్న కుటుంబమును గూర్చి చింతించాడు. తన తండ్రిని గూర్చి ఎక్కువ బాధపడ్డాడు. తండ్రి బ్రతికియున్నాడా? తమ్ముడు బెన్యామీను విషయమేమిటి? అన్నలయొద్ద నుండి తనకు ఎదురైన ప్రమాదమే బెన్యామీనుకు సంభవించిందా? యోసేపు ఇప్పుడు తనకున్న అధికారముతో నిస్సహాయులైన తన కుటుంబ సభ్యులను ఆదుకొనుటకు నిశ్చయించుకున్నాడు.

యోసేపు వలెనే మనము కూడా ఆ పని చేయాలి. మన కుటుంబ సభ్యులకు ఇతరులు అపకారము చేసినపుడు కూడా ఆ ప్రవర్తనను మనము అంగీకరించకూడదు.

మనలో ప్రతి ఒక్కరు దేవుని దృష్టిలో విలువైన వారే. అందరి కొరకు యేసు సిలువ మీద మూల్యమును చెల్లించెను.

**మనము పొందే బాధ విషయమై యేసు ఎందుకంత జాగ్రత్త తీసుకుంటాడు? (మత్త 25:41-46).**

అందరినీ యేసు తన రక్తముతో కొన్నాడు. మనము ఆయనకు చెందినవారము ఎవరైనా ఇతరులపై దాడి చేసినచో వారు యేసు యొక్క ఆస్తిపై దాడి చేస్తున్నారని గుర్తించాలి. లైంగిక వేధింపులు పెట్టుట తప్పు. కొట్టుట తప్పు అది వ్యక్తిగత విషయాల కిందకు రావు. అట్టి సమయాలలో వృత్తి నిపుణుల సహాయము తీసుకొని కుటుంబ సభ్యులకు న్యాయము జరుగునట్లు చూడాలి.

సోమవారం ఆగష్టు 9

**పరీక్షలు (ఆది 42:21-24)**

యోసేపు తన సహోదరులను క్షమిస్తాడు. అది ఎప్పుడు సంభవిస్తుందో మనకు తెలియదు. వారు ఐగుప్తుకు తిరిగి వచ్చిన వెంటనే అతను ఆ పని చేయవలసి యున్నది. యోసేపు గనుక వారిని క్షమించుటకు నిరాకరించినచో అతనికి ఎన్నడూ విజయము లభించదు. ఎందువలన? తన కోపము తన హృదయమును భక్షించును. దేవునితో మనకున్న స్నేహమును కోపము గాయపరుస్తుంది.

మానవులు వారిని గాయపర్చిన వారిని క్షమించినచో వారు బాధపడే ఘోరమైన వ్యాధుల నుండి స్వస్థత పొందునట్లు ఎన్నో అధ్యయనముల ద్వారా కనుగొన్నారు. మనము ఇతరులను క్షమించుటకు నిరాకరించినపుడు మన జీవితాలు మన బాధవలన నాశనమగును. క్షమించుట ద్వారా బాధ నుండి విముక్తి చెందుదుము. మన యెడల తప్పిదము చేసిన వానికన్నా క్షమాపణ అనునది మన మీద ఎక్కువ పని చేస్తుంది.

అవును! యోసేపు తన సహోదరులను క్షమించెను. అయితే పరిస్థితులు పూర్వము వలెనె కొనసాగడం తనకిష్టము లేదు. అందువలన తన సోదరులు పూర్తిగా మారిపోయారా లేదా అనే విషయాన్ని రూఢి పర్చుకోవాలనుకున్నాడు.

**తన సోదరులు చెప్పే విషయాలలో యోసేపు ఏమి విన్నాడు? ఆది 42:21-24 చదువుడి. వారు మాట్లాడుకొనుచుండగా ఆ మాటల నుండి యోసేపు ఏమి నేర్చుకున్నాడు?**

సోదరులందరు ఏమి మాట్లాడుకొనుచున్నారో యోసేపునకు అర్ధమవుతుందనే విషయము వారికి తెలియదు. వారి మాటలు యోసేపునకు అర్ధము కాదనే అభిప్రాయంతో వారున్నారు. తనకు వ్యతిరేకముగా తన సోదరులు చేసిన పాపమును గూర్చి ఒప్పుకొనుచున్నట్లు ఆయనకు వినబడింది. యోసేపునకు కలిగిన కలల నుండి, వారిని గూర్చి అతడు తన తండ్రికి చెప్పుచున్న చెడు విషయాల నుండి, వారి తండ్రి యోసేపును ఎక్కువ ప్రేమిస్తున్నాడనే విషయం నుండి తప్పించుకొనవచ్చునని యోసేపును ఆ దినమున అమ్మేసారు. వారు యోసేపును తొలగించుకున్నారు కాని ఆశించిన విధముగా వారికి విశ్రాంతి లభించిందా? లభించలేదు. ఈ సంవత్సరాలన్నీ వారెంతో దోష భావముతో జీవించారు. నిరంతరము ఆ తలంపులు గుర్తుకు రావడము వలన అలసిపోయారు. విసిగిపోయారు. యోసేపునకు వారు చేసిన కీడును బట్టి దేవుడు వారికి ప్రతిదండన చేస్తాడనే భయము వారిని వేధించింది.

ఆహార కొరత మరికొన్ని సంవత్సరాలు కొనసాగుతుందని యోసేపునకు తెలుసు. అందుచేత వారు రెండవసారి ఆహారమును కొనుటకు వచ్చునపుడు బెన్యామీనును వెంట బెట్టుకొని రమ్మని చెప్పెను (ఆది 42:20). యోసేపు షిమ్యోనును బందీగా తన యొద్ద ఉంచుకొనెను (ఆది 42:24).

యోసేపు బెన్యామీను సజీవుడుగా ఉన్నాడని చూచినప్పుడు ఒక విందు ఏర్పాటు చేసాడు. ఆ విందులో బెన్యామీను తనకెంత ప్రీతిపాత్రుడో చూపాడు (ఆది 43:34). బెన్యామీనును ఎక్కువగా ప్రేమించుట వలన తన సోదరులు ఇంకా అసూయ పడుతున్నారో లేదో తెలుసుకొనుటకది పరీక్ష . వారు ఒక పట్టణస్తులనొకసారి మోసము చేసారని యోసేపుకు తెలుసు (ఆది 43:13) తన తండ్రికి తన్ను గూర్చి అబద్దము చెప్పారని తెలుసు (ఆది 37:31-34). అందుచే వారికి మరొక పరీక్ష పెట్టాడు (ఆది 44).

**మంగళవారం** **ఆగష్టు 10**

## క్షమించు మరియు మరచిపో (మత్తయి 18:21-35)

**మనము ఇతరులను క్షమించుట వలన ఏమి జరుగును? (మత్త 18:21-35)**

యేసును బట్టి దేవుడు మనలను క్షమించిన అన్ని విషయములను అర్ధము చేసుకొనవలెను. ఇతరులు ఏవిధముగా క్షమించాలని నేర్చుకొనుటలో భాగముగ అర్ధము

చేసుకొనుట అనునది ప్రాముఖ్యమైన విషయము. మనమందరము పాపము చేసాము. ఇతరులకు, దేవునికి వ్యతిరేకముగా పాపము చేసాము.

ప్రతి పాపము మన ప్రభువైన యేసుకు వ్యతిరేకమైనదే. అయితే యేసును బట్టి మనము చేసిన అన్ని పాపములను క్షమించమని దేవుని అడుగగలము. పరలోకము నుండి వచ్చిన ఈ విలువైన వరమును సంపాదించుకొనుటకు మనమేమియు చేయలేదు. తన కృపను బట్టి దేవుడు మనలను క్షమిస్తున్నాడు. ఈ బైబిలు సత్యములను అర్థము చేసుకున్నపుడు దేవుని యొద్ద నుండి వచ్చే క్షమ విలువైన వరముగా అంగీకరించవచ్చును. అప్పుడు మనలను గాయపర్చిన వారిని క్షమించగలము. మనమెందువలన వారిని క్షమించాలి? క్షమింపబడుటనే వరమును సంపాదించుకున్నారు గనుక మనకు విరోధముగా తప్పు చేసిన వారిని మనము క్షమించాలి.

మనము బైబిలులో చూచినట్లుగ యోసేపు తన సోదరులకు రెండవ అవకాశమును ఇస్తున్నాడు. గత కాలములో తనకు వ్యతిరేకముగా తన సోదరులు చేసిన నేరాలకు తన హృదయములో ఎట్టి కోపమును దాచుకొనలేదు.

ఒక కుటుంబములో ఉన్న మనము ఒకరినొకరిని గాయపర్చుకుంటూ ఒక నూతన ఆరంభము కొరకు ఎదురుచూడగలమా? కష్టమే కదా? అయితే దేవుని సహాయముతో నూతన ఆరంభము సాధ్యమవుతుంది. యోసేపు అతనికి తన సహోదరులు చేసిన విషయాలను బట్టి ప్రతీకార చర్యలు ఏమీ తలపెట్టలేదు లేక కక్ష తీర్చుకొనుటకు ప్రయత్నించలేదు. యోసేపు గతమును తన వెనుకకు నెట్టి జీవితములో ముందుకు సాగిపోయాడు. తన సోదరులనుఅంగీకరించాడు. వారికి తన ప్రేమను చూపాడు. యోసేపునకు వేరే తలంపు తన హృదయములో ఉండి ఉంటే పర్యవసానము ఏవిధముగా ఉండెడిది? అప్పుడు ఈ వృత్తాంతము ఇంత సంతోషముగా ముగింపునకు వచ్చి యుండెడిది కాదు.

**రోమా 4:7, 8 చదువుడి. యేసునందు దేవుడు మనకనుగ్రహించిన వరమును గూర్చి ఈ వాక్యాలలో పౌలు మనకేమి చెప్పాడు? మంచి కొరకు ఈ ఆశ్చర్యకరమైన వాగ్దానము మన జీవితాలను ఏవిధంగా మార్చగలదు?**

బుధవారం ఆగస్టు 11

## క్షమించడమనే లక్షణమును వ్యక్తిగతము చేసుకొనుట (లూకా 23:34)

ఎవరినైనా నీవు క్షమించవలసియున్నావా? అయితే ముందుగా నీవు గాయపడినావని ఒప్పుకోవాలి. ఆవిధముగా చేయుట అంత సులభము కాదు. కొన్నిసార్లు మన భావాలను దాచుకొని మనలనెవ్వరు గాయపర్చలేదని ప్రవర్తిస్తూ ఉంటాము. అయితే దేవునితో మేము కోపముగా ఉన్నామని చెప్పుట మంచిదే. కీర్తనలను రచించిన గ్రంథకర్తలు ఎక్కువసార్లు అదే పనిని చేయుట చూస్తున్నాము. మీకేమి సంభవించినదో దాని విషయమై మీరు చాలా విచారముగా ఉన్నారని దేవునితో చెప్పుటకు సందేహించవద్దు. నీ యెడల ఇతరుల ప్రవర్తన బాధ కలిగించేదిగాను, గాయపర్చేది గాను ఉందనియు, తద్వారా నీవు చాలా విచారముగా లేక కోపముగాను ఉన్నావని దేవునితో చెప్పండి.

యోసేపు చరిత్రలో అతడు తన సోదరులను మరల కలుసుకున్నపుడు ఏడ్చినట్లు చూస్తున్నాము. ఆ సమయములో తనకు గతములో సంభవించిన కొంత బాధను కూడా జ్ఞాపకము చేసుకొని యుండవచ్చును.

**యేసు సిలువ మీద ఏమి చెప్పాడు? ఎవరినైనా క్షమించుటకు మంచి సమయము ఏమైయుంటుందని ఆయన మాటలు గుర్తు చేస్తున్నాయి? లూకా 23:34.**

యేసు తన క్షమాపణను అనుగ్రహించుటకు ఆయనను అడిగే వరకు వేచియుండలేదు. అందుచే ఎవరైనా మనకు కీడు చేసినచో ఆ వ్యక్తి మనలను క్షమాపణ అడిగేవరకు వేచి యుండవద్దు. మనము వారినుండి క్షమాపణ పొందకముందే వారిని మనము క్షమించవలసియున్నాము.

**మనలను గాయపర్చిన వారిని గూర్చి ఏవిధముగా స్పందించాలని ఈ వాక్యాలు బోధిస్తున్నాయి? లూకా 6:28; మత్తయి 5:44. వారికి మనమేమి చూపించాలి?**

ఎన్నిక చేసుకొనుట ద్వారా ప్రేమించుట మరియు క్షమించుట అనేవి మొదలగును. ఒకరు అనుభవించే భావమును బట్టి అవి ప్రారంభించబడవు. ఇతరులను క్షమించాలనే భావము మనలో లేకపోవచ్చు. అయినప్పటికిని దేవునికి తెలుసు. మనుష్యులు దానిని చేయలేకపోవచ్చు కాని దేవుడు చేయగలడు. ఆయన ఏమైనా చేయగలడు (మార్కు 10:27). మనకు ద్రోహము చేసిన వారి కొరకు ప్రార్థించమని యేసు చెప్పెను. ఒకవేళ మనము

దుఃఖ పెట్టిన వ్యక్తి అప్పటికే మరణించినచో మన హృదయమును స్వస్థపర్చమని దేవున్ని ప్రార్ధించినచో మనము ఇతరులను క్షమించుట నేర్చుకుంటాము.

క్షమించుట అన్నివేళలా సులభం కాదు. ఇతరులు చేసిన గాయము భయంకరమైనదై యుండవచ్చు. వారి వలన మనము శ్రమలను అనుభవిస్తాము. అట్టి సమయములో మనము అనుమతించినచో స్వస్థత కలుగుతుంది. అయితే కోపము ద్వేషమున్నపుడు మనలో స్వస్థత ఎన్నటికి రాదు.

మనలను క్షమించుట కొరకు యేసు సిలువ మీద చెల్లించిన తన ప్రాణము ఒక మంచి ఉదాహరణయై యున్నది. అనేకమంది ఆయనను తిరస్కరిస్తారని కూడా ఆయనకు తెలుసు. అయితే యేసు మన కొరకు చనిపోవుటకు సిలువ మీదికి వెళ్ళెను.

గురువారం ఆగష్టు 12

## మనము క్షమించిన తరువాత విశ్రాంతిని కనుగొనుట (ఆది 50:15-20)

యోసేపు యొక్క కుటుంబమంతయు చివరికి ఐగుప్తునకు వచ్చిరి. కొన్ని సంవత్సరాల క్రితం వారి సహోదరుడైన యోసేపును బానిసగా అమ్మిన విషయాన్ని తండ్రికి వివరించియుంటారు. కౄర మృగాలు కుమారుని చంపి ఉంటాయని యాకోబు తలంచగా, ఆయన ఇపుడు ఐగుప్తు దేశమంతటిపై అధికారిగా ఉన్నాడు.

**ఆది 50:15-21 ప్రకారము యోసేపు సోదరులు దేని నిమిత్తము ఆందోళన చెంది యుంటారు? ఆందోళన చెందారని మీరెందుకు ఊహించుకుంటున్నారు? వారిని గూర్చి ఈ భయము ఏమి చెపుతుంది?**

ఇప్పటికి యోసేపు సోదరులు ఐగుప్తులో జీవించడం మొదలు పెట్టి 17 సం।। అయింది. (ఆది 47:28) అయితే యాకోబు మరణించినపుడు యోసేపు వారి మీద కక్ష సాధిస్తాడని సోదరులు భావించారు. యోసేపును వారెంత కష్ట పెట్టారో ఆ విషయాలన్నిటిని మరొకసారి జ్ఞప్తికి తెచ్చుకున్నారు. తండ్రి చనిపోయిన తరువాత మరొకసారి తన సోదరులను క్షమించానని చెప్పాడు. క్షమించానని చెప్పుట అందరికి మేలు జరిగియుంటుంది.

ఎవరైనా మనలను బాధపెట్టినపుడు అనేకమార్లు వారిని క్షమించుట మంచిదేనేమో. తప్పును జ్ఞాపకము చేసుకున్నపుడు వెంటనే ప్రార్ధించాలి. మనకు సహాయము చేయమని దేవునిని అడగాలి. మరొకసారి క్షమించాలనే తీర్మానమును మనము తీసుకొనవలసియున్నాము.

**ఆది 50:20 చదువుడి. తన సోదరులు చేసిన కీడును బట్టి వారిని క్షమించాలని యోసేపు మనస్ఫూర్తిగా ఎందుకు కోరినాడని ఈ వాక్యము చెపుతుంది?**

ఆ కాలములో ఎదురైన కరువు నుండి భూమి మీదున్న ప్రజలను కాపాడుటకు దేవుడు ఏర్పాటు చేసిన పెద్ద ప్రణాళికలో తన జీవితము ఒక భాగమైయుందని యోసేపు చాలా దృఢముగా నమ్మాడు. ఆహార కొరత వలన ఏర్పడిన క్షామం లేక కరువు సమయములో తన కుటుంబము ఒక బలమైన జనముగాను, ప్రాముఖ్యమైన దేశముగాను ఎదుగుటకు సహాయపడుటకు దేవుడు తనను ఎన్నుకున్నాడని యోసేపు నమ్మాడు. తన యెడల దురాలోచనతో కూడిన సహోదరులు ప్రణాళికలను దేవుడు మంచి జరుగుటకై మార్చి వేసెనని యోసేపుకు తెలుసు అందుచేతనే తన సోదరులు తన యెడల చేసిన పాపమును యోసేపు క్షమించగలిగెను.

**యోసేపు యొక్క చరిత్ర సుఖాంతమైంది. ఒక వృత్తాంతము విషాదముగా ముగిసిన యెడల మనము ఏవిధముగా భావిస్తాము? యేసు రెండవసారి వచ్చునపుడు పాపమునకు ముగింపు చెప్పనైయున్నాడు. ప్రపంచ వ్యాప్తముగా మంచి చెడుల మధ్య జరుగుచున్న యుద్ధము ముగియును. అప్పుడు ఈ భూమి మీద జరిగిన చెడుకు బదులుగా నిజమైన సంతోషము భూమి మీద నెలకొల్పబడును.**

శుక్రవారం ఆగష్టు 13

## అదనపు అధ్యయనము

యోసేపు మనకు యేసును అనేక రీతులలో చూపిస్తున్నాడు. తన సొంత అన్నల చేత యోసేపు దేవుని ఎరుగనట్టి వారికి అమ్మబడెను. యేసును తన సొంత అనుచరుడే అతి ఘోరమైన శత్రువులకు అమ్మివేసెను. తాను చేయని పనికి యోసేపు నిందించబడెను అతడు నిరపరాధి యైనను చెరసాలలో బంధింపబడెను. అదేవిధముగా యేసును ప్రజలు ద్వేషించి, ఆయన పరిశుద్ధుడు గనుక తిరస్కరించిరి. యేసు ఏ నేరము చేయలేదు కాని అబద్ధ సాక్ష్యములు ఆయనకు విరోధముగా చెప్పుట వలన ఆయనను సిలువపై వ్రేలాడదీసారు. ప్రజలు యోసేపు యెడల అన్యాయముగా ప్రవర్తించినపుడు అతడు సహనమును వహించెను. యోసేపు తన సోదరులను క్షమించుటకు కూడా సిద్ధపడెను. సోదరుల హృదయాలు ద్వేషముతోను, పగతోను నింపుకొని యున్నారని తెలిసి కూడా వారి యెడల ప్రేమ కృప చూపించెను. ద్వేషము స్వాభావికము కాదు. ద్వేషించాలని

తీర్మానించుకుంటేనే ద్వేషము పుట్టుకొస్తుంది. చెడ్డ మనుష్యులు అతని ద్వేషించినపుడు వారిని గూర్చి నిందారోపణ చేయక పోవుట ద్వారా రక్షకుని చూపిస్తున్నాడు. తనను చంపిన వారిని క్షమించమని అడిగిన యేసును యోసేపు మనకు చూపుచున్నాడు. 'యోసేపు తన సోదరులను క్షమించెను' –ఎలెన్ జి వైట్ పితరులు మరియు ప్రవక్తలు, పుటలు 239, 240.

క్షమించలేని హృదయము కలిగియుండుటకు మనకు ఎట్టి సాకు లేదు. ఎవరైనా ఇతరుల యెడల కరుణను చూపలేకపోతే వారికి దేవుని యొద్ద నుండి వచ్చే క్షమాపణ కృపను గూర్చి తెలిసియుండకపోవచ్చును. యేసు తన జీవితములో సున్నితమైన ప్రేమను చూపాడు – ఎలెన్ జి వైట్, క్రీస్తు యొక్క ఉపమాన పాఠములు, పుట 251.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. మనము ఇతరులను క్షమించలేమంటే, విషము త్రాగి వేరే వాడెవడో చనిపోతాడని భావించినట్లుంటుందని ఎవరో ఒకరు చెప్పారు. ఈ మాటల యొక్క అర్ధమేమి?
2. యోసేపు నిజముగా తానెవరో అని తన సోదరులకు చెప్పక పూర్వము ఎందుకు తన సోదరులకు అనేక పరీక్షలు పెట్టాడు? ఆ పరీక్షలు తనకు, సోదరులకు ఏమి లాభము చేసినవి?
3. యోసేపు గృహ నిర్వాహకుడు. యోసేపు సోదరులను గూర్చి తెలుసుకొని యుంటాడు (ఆది 44:1–12). యోసేపును గమనించడమనే అనుభవము అతనికి ఏవిధముగా సహాయపడినది?

❖❖❖